


# ఆడదానికి లొంగడమా

శ్రీ మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ

"ఏమండీ! ఏమంటారు?

"ఏమన మంటావు? నీవేది అనమంటే అది అంటాను.

"ఇది మరీ బాగుంది. ఎప్పుడూ వేళాకోళ మేనా?

"ఏమీ చెప్పకుండా ఏమంటా రంటే ఏమి చెప్పను మరి?

"అవును పాపం! మీకు విషయం బొత్తిగా తెలియదు ఏం?

"నిజంగానే తెలియదు.

"అవును. మీ అనుకూలాన్ని బట్టి ఉంటుంది తెలియడమూ తెలియక పోవడమూనూ. మీ కిష్టం లేదు గనుక తెలియనట్లూ మరిచి పోయినట్లూ నటిస్తారు. ఎన్ని వేషాలైనా వేయ గల్గుదురు మీరు.

"ఎన్నో వేయలేను సుమా! ఏదో ఒకటి రెండు. అవైనా ఈ మధ్యనే హుషారు కొద్దీని.

"నాచేత నేమవుతుంది మీకు సమాధానం చెప్పడం? మాట ఒకటయితే అర్థం ఇంకోటి తీస్తారు.

"రెండర్థాలతో మాట్లాడడం నాకూ చేత గాదు.

"సరే లెండి. ఎందు కొచ్చిన కబుర్లు. అసలు విషయం మార్చడానికి ఏదో ఒక వాదం బయలు దేర తీస్తారు.

"అసలు విషయం నీవు బయటికి రానిస్తేనా?

"పది రోజులనుంచీ చెవులో ఇల్లు గట్టుకొని పోరుతూ ఉండే విషయం నేను బయటికి రానీయక పోవడ మేలాంటిదీ?

"నాది ఎడ్డెవాద మంటావు గాని, నీకూ వాదన పెంచడ మంటే సరదాయే. ఎప్పుడైనా నీవు ఉపోద్ఘాతం లేకుండా విషయం బయటికి రానిచ్చావూ?

"పైగానా? చీర విషయం మిమ్మల్ని ఎన్నాళ్లనుండీ అడుగు తున్నానండీ? విషయం మార్చడమూ, ఏదో తప్పు ఒకటి కనిపెట్టి నామీదికి నెట్టడమూ మీకు మామూలుగాని.

"చాలా రోజులనుంచీ చెబుతూనే ఉన్నావు. సుమారు పదిహేను రోజుల నుంచీ.

"మరి ఇంకేం.

" అయితే యీ పదిహేను రోజులనుంచీ ఒక్క చీర మాటే చెప్పుతున్నావా? పులిచేరు గొలుసు మాట చెప్పుతున్నావు. కాళ్లకు—అవేమిటీ అవి—ఆ గొలుసుల మాట చెప్పుతున్నావు. అమ్మాయికి పట్టు గౌనులనీ, పట్టు పరికిణీలనీ చెబుతున్నావు. ఇన్నింటిలోనూ నీవు ఇప్పుడు ఎత్తింది చీర మాటేనని నేను కలగన్నానంటావా?

" ఏదో మసిబూసి నేరేడుకాయ చేసి, దబాయించి మీరన్న మాటే రైటు అనిపించుకుంటారు. పోనీ మీ మాటే సెగ్గనీయండి ఏంముంచుకు పోయింది గనుక.

" ఏదో నా గౌరవం దక్కించడానికి పూనుకున్నావు అంత వరకే సంతోషం.

" సరే గాని చీరె మాట ఏమంటారు?

" ఈ మాటే మొట్ట మొదట అంటే?

" ఇప్పు డన్నాగా చెబుదురూ.

" మరి మిగతా వాటి మాట?

" వాటి మాట తరువాత చూసుకోవచ్చు, ముందు ఈ నెలకు చీరె మాట చెప్పుదురూ.

" వాటి మాట ఈ నెలలో అడగవన్న మాట?

" ఊహుఁ

" అయితే సరే.

" మరి చీరె మాటేమిటి?

" చీరెకు ఈనెల పైకం దొరకదు.

" పైకం ఒకప్పుడు దొరుకుతుందా ఏమిటి? జీతంలో నుంచి ఖర్చు పెట్టాలిగాని.

" దొరకదంటే మిగలదన్నమాట.

" అలాగా? నాకా అర్థాలమాట ఏం తెలుసు? నే నాలా చదువుకో లేదు. నిఘంటులో ఈ అర్థంకూడా ఇరికించండి మీరు.

" ఆడవాళ్లకు ఇందుకే చదువు వద్దంటాను నేను. కాస్త చదువుకుంటే సరి వ్యాఖ్యానాలు బయలు దేరతీస్తారు.

" వ్యాఖ్యానాలు బయలు దేర తీయడమే కారణమయితే చదువు ఎవరికీ వద్దంటాను నేను. మగవాళ్లకేమిటి, ఆడవాళ్ల కేమిటి.

" నీవు ప్రభుత్వానికి వస్తే నీయిష్టం వచ్చిన శాసనాలు చేయింతువు గాని.

" అలాగే మరి. అప్పుడు ఆడవాళ్లు చీరెలుగాని, గొలుసులు గాని అడగడ మనేది ఉండదు. అంతా వాళ్ల ఇష్టమే.

" నీ ధర్మమా అని అలాటి పరిస్థితులకోసం నీకు ప్రభుత్వం వచ్చిందాకా ఆగనక్కరలేదు. నీకు ప్రభుత్వమే వస్తే మీజాతికి ఇంకా ఎక్కువ లాభాలు కలుగ జేసుకోవాలి.

" చూశారా అక్కడి కక్కడికి పెంచి అసలు విషయం ఏలా వెనక పడేశారో?

" నేనా? నీవే. నీకు కావలసిన ప్రభుత్వపు గొడవలో చీర మాట మరిచి పోయినావు. ప్రభుత్వంలో చీర ఎన్నోవంతు.

" ఎందుకు వచ్చిన కబుర్లు గాని చీరె మాట చెప్పండీ.

" ఇందాకనే చెప్పాను. ఈనెల పైకం మిగిలేట్లు లేదని.

" ఎప్పుడూ అలాగే అంటూను పోదురూ. అడగంగానే ఎప్పుడైనా కాని పెట్టారా నేను కోరింది?

" అడిగిం తర్వాత మటుకు కొని పెట్టా నంటావా?

" అదీ నిజమే. సంవత్సరాల తరబడి అడిగినా కొని పెట్టరు.

" అందుకనేగా పాపం నీకు బొత్తుగా చీరెలు లేవు, సొమ్ములు లేవు? ఏం? కాదు? పట్టుచీరెలు పదీ, చేతులకు నాలుగు జతలు, కాళ్లకు మూడు జతలు, మెళ్లో

శ్రీ సుబ్రహ్మణ్య శర్మ

నాలుగు రకాలు ఇవన్నీ ఎన్నో తరాలగా అడిగితే వచ్చిన వన్నమాట ? లేకపోతే నీమీది ప్రేమకొద్దీ మీ వాళ్లు నీ ఒళ్లో పడేశారా ?

" సమయం పోనివ్వరు పాపం మావాళ్ల మాట ఎత్తడానికి. కొన్ని పెళ్లిలో పెట్టినవీ, కొన్ని మామగారు కొన్నవీ, కొన్ని అత్తయ్య ప్రోద్బలం చేసి కొనిపించినవీ తప్ప నే నడిగితే కొనిపెట్టిన వేమైనా ఉన్నాయా ?

" ఏదీ ? సరిగా నామొహం వైపు చూసి అను ఆమాట ? నీపోరుచేత కొన్నవి కూడా ఉన్నవంటావా ? లేవంటావా ?

"ఆ ఉన్నాయి లెండి అష్టా ఇష్టా పదేళ్లు ఉద్యోగం చేస్తే సంవత్సరం నాడు ఒక చీర పదిహేను రూపాయలకు కొని పెట్టారు ఏలాగయితే నేమి. ఒక్క చీర కొనమంటే బోలెడు వాగ్వాదం పెంచుతారు.

" ఈ నెలలో ఉండే ఖర్చు చూస్తూనే నీవు చీర కొనమనడమేలా ఉంది ?

" ప్రతినెలా కంటె ఈ నెల ఎక్కువ ఖర్చు ఏం వచ్చిం దేమిటీ ?

" ఆఫీసులో ఫోటోగ్రాఫుకు, టీపార్టీకి అయిదు రూపాయలు, ఏదో సంఘానికి పాతిక రూపాయలు, నలుగురు బ్రాహ్మణులు వచ్చారు, వారికి నాలుగు రూపాయలు.

" అవే తగ్గించుకోక పోయినారు.

" ఏలా ? పేరు గొప్పగదా అని వస్తారు. ఊరు దిబ్బ అనీ అందులో నీలాటి ఇల్లాలు ఉందనీ వాళ్లకేం తెలుసు ?

" కొంటారా ? కొనరా ? చెప్పండి చివరమాట.

" చివరమాట అంటావు గాని అది చివర మాట కానివ్వవు. ఆ తరవాత ఇంకా అయినంత ప్రసంగం చేస్తావు.

" అబ్బ ! చెప్పండీ. కొంటారా కొనరా ?

" కొననని చెప్పను. ఇప్పుడు మటుకు కాదు.

" కొనని చెప్పను అన్నందు వల్ల నా కిహ సంతోషమేమిటీ ? ఎప్పుడో కొంటాగు బ్రతికి బాగుంటే.

" పోనీ అమ్మాయికి పట్టుగౌనులు, పట్టు పరికిణీలయినా కుట్టించండి.

" అవి ఏవీ ఇప్పుడు అడగ నన్నావు జ్ఞాపకం ఉందా?

" అమ్మా ! ఎంత టక్కరితన మండీ ! ! చీరకొని పెడతారేమో ననుకొని అవేవీ అడగ నన్నాను.

" ఆలాగా ? అవును. నాకూ తెలుసు నీకేదైనా కావలసి వస్తే అమ్మాయి సంగతి కూడా వెనక్కి నెట్టుతావని.

" ఆలాగే ననుకోండి. అమ్మాయి మీద మీకున్న ప్రేమ నాకు లేదనే అనుకోండి.

" అనుకోవడం దేనికి కనపడుతూనే ఉంటే.

" సరే నంటినిగా !

"......................"

" ఏమండీ ! చెప్పరూ చీర మాట.

" ఏమాత్రం ఖరీదులో ఉండేమిటీ ?

" ఇరవై అయిదు రూపాయలు.

" ఆ ! కొద్దే. ఏం ఇప్పుడు ఆచీర లేకపోతే పని జరగదా ?

" జరగదనా. ఎంత బాగుంది అనుకున్నారు ఆచీర. కొత్తగా వచ్చినవట ఆమాదిరి చీరెలు. వాటిని వర్ణించడానికి ఆది శేషుడికైనా అలవి కాదు.

" అదుగో అదీ ప్రబంధం పోకడ, నాక్రిందికి నేనే ఎసరు తెచ్చి పెట్టుకున్నాను [illegible].

" నా కెంత మనసయిం[illegible] ఆ ఇనస్పెక్టరు గారి భార్య లేకితన మనుకుం[illegible]ంది అడిగి ఒక్కసారి కట్టుకుందామా అన్నంత మనసయిందండీ.

"పోనీ ఆపని చెయ్యనైనా చెయ్యక పోయినావు? ఆవిడ ఏమనుకుంటే నేమి? నీకు మనసూ తీరేది. నాకు ఖర్చూ తప్పేది.

"అది ఒకటి కొని పెట్టుదురూ. ఇహ ఇప్పట్లో నేను మిమ్మల్ని ఏమీ అడగనుగా!

"ఎప్పటి కప్పుడు అంతే నీవనేది.

"ఈతడవ చూడండి.

"ఈలా ఎన్నిసార్లు చూశాను. మళ్లీ నెలలోనే మొదలు.

"మీరు మాత్రం సంవత్సరానికి ఒకసారి, అరసారేగా కొనేది. వెనుక మీరు కొన్నది క్రిందటి శ్రావణమాసం ...ందర. మళ్లీ శ్రావణ మాసం వచ్చింది.

నీవు అడిగినప్పుడల్లా కొంటే రామగురుడా సీతారాం దేరాలిసిందే.

...డా ఎందుకు లెండి?

"......................"

"ఏమండీ! ఏమంటారు?

"ఏమన మన్నావు? పైకం లేదంటున్నాను విన పడ్డదా?

"ఇంతే లెండి. ఎంత ప్రతిష్ఠాలినా కనికరం లేదు.

"......................"

"పోనీ నాదగ్గర పదిరూపాయలు లున్నాయి. మిగిలిన పైకమయినా ఇవ్వండి.

"ఆలారాజీకిరా. వీలయితే చూడవచ్చు. నీకు వేరే ఖజానా ఉండగా పైకం అంతా నన్నివ్వ మంటే ఎక్కడ తీసుకురాను? జేబులో ఉన్నాయి పదిహేను రూపాయలూ తీసుకుని మీ అన్నయ్య వచ్చినప్పుడు తెప్పించుకో. మావాళ్లు కొని పెట్టారని మాత్రం చెప్పబోకేమి?

"అంతా మీ రివ్వలేదుగా అయినా అనక పోవడానికి.

"ఆలా అయితే అసలు రాదు పైకం.

"సరే అనను లెండి. ఈ కాస్తమాటభాగ్యానికి ఎన్ని తంటాలు పెట్టారండి?

"ఆ చీర కోసం నీవెన్ని తంటాలైనా పడే దానివే. ఎవరా వాకిట్లో దగ్గేదీ.

"నేను రా శాస్త్రిని.

"రా లోపలికిరా. అక్కడ కూర్చున్నా వేం?

"ఇక్కడ పేపరు చదువు కుంటున్నా లే.

"రావోయి. నీకు పరాయి వాళ్లెవరూ ఇక్కడ? ఎంతసేపయిం దేమిటీ వచ్చి?

"ఒక పావు గంట కాలే?

"ఆ! మరింట్లోకి రాలేదేం?

"మీరేదో మాట్లాడు కుంటూంటేను.

"ఏముందీ? ఎప్పుడూ ఉన్న సంగతే. ఏదో కావలె నని ఆవిడా, ఇప్పుడు కాదని నేనూ. చివరకు ఆవిడ మాటే నెగ్గించు కున్నది.

"వింటూనే ఉన్నా.

౨

శాస్త్రి నాకు చిన్నప్పటి నుంచి స్నేహితుడు. ఒక ఊళ్లోనే పుట్టాము, చిన్నప్పటి నుండీ ఒకక్లాసు చదివాము. ఇద్దరమూ ఒకేసారి బి.ఏ., పరీక్షయినాము. ఇద్దరికి ఒక ఊళ్లోనే ఉద్యోగ మయింది. దానా దానా స్నేహం వృద్ధయింది. ఇంచు మించుగా అన్నదమ్ముల లాగా ఉంటున్నాము. మాలో మాకు ఏ మాత్రము బెరుకు లేకుండా ఉంటున్నాము.

మా యింట్లో వాడికీ, వాళ్లయింట్లో నాకూ అమిత స్వతంత్రం. అయినా నాడు మా భార్యా భర్తల కిద్దరికీ జరిగిన సంభాషణ వాడు పావుగంట సేపటినుంచీ వింటున్నా డంటే వాడు నన్ను గురించి ఏమి అభిప్రాయం పడ్డాడో అని ఒకటే బెంగ పట్టుకుంది.

నేనైనా ఫక్తు పెళ్లాంమాట వినేవాణ్ణి కాదని నా అభిప్రాయం. ఎవరి అభిప్రాయమైనా అంతే అనుకోండి. ఎంత గడుసు పెళ్లాం మొగుడయినా అక్షరాలా తనంత మొగవాడు లేడనుకుంటాడు. నేను మా ఆవిడ చెప్పంగానే మాత్రం ఏపనీ చెయ్యను. మా ఆవిడ గడసరి అయినా నామీద అధికారం చెయ్యకుండా నన్ను లాలించి తన పని నెరవేర్చుకుంటుందని నేనే అనుకుంటాను. దీన్ని బట్టే నేను నాభార్యకు లొంగను అని అనుకుంటానో ఏమో?

అయితే ఒక్కమాట. ఏ విషయం వచ్చినా మా ఆవిడతో సలహా పడడం నాకు మామూలు. ఆవిడ సలహా అంగీకరించడమూ కద్దు. అంగీకరించకపోవడమూ కద్దు. కాని ఆవిణ్ణి సలహా అడగడం అనే అలవాటు మొదటినుంచీ వుంది.

ఎవరి అలవాట్లు వాళ్లవి. ఎవరి అభిప్రాయాలు వాళ్లవి. అయినా ఆ రోజున మా ఇద్దరికీ జరిగిన సంభాషణా ఫలితంగా నేను ఆమెకు లొంగి పోయి ఆమె చీరకు పైక మిచ్చానని అనుకుంటాడేమో మావాడు అని బెంగ. మానవుడు ఆడదానికి లొంగటానికైనా ఒప్పుకుంటాడు గాని, ఇతరులు అతన్ని గురించి ఆడదానికి లొంగే వాడని చెప్పుకోడానికి మాత్రం సుతరామూ ఒప్పుకోడు. మొగుడు కొట్టినందుకు కాదు తోడి కోడలు నవ్వినందుకు ఏడుస్తున్నా ననేది సామెతేకదూ. ఎంత పెళ్లానికి లొంగే వాడయినా, ఇతరులంతా అతనంత భార్యమీద అధికారం చేసేవాడు లేడని అనుకో వలెననే అతను ప్రయత్నం చేస్తాడు.

ఇంచు మించుగా నాస్థితి అంతే అయింది. మేమిద్దరమూ షికారు వెళ్లుతున్నప్పుడు నా అంతట నేనే ఆ విషయాన్ని ప్రస్తావించి.

“ఏమిటోరా! ఏదైనా వస్తువు కావలసి వస్తే ఆడవాళ్లు ప్రాణాలు కొరికేస్తారు. ఏదో భగవంతుడి దయవల్ల నాలుగు రాళ్లు సంపాదిస్తున్నప్పుడు మొండిగా కాదనడానికి మనసొప్పదు. మొత్తం మీద వాళ్లమాట వాళ్లెలాగోలా నెగ్గించుకుంటారు.

“ఒక మాట చెప్పుతాను వింటావురా ఒరే! ఈ ఆడజాతి ఉందే దాన్ని ఎప్పుడూ చెప్పుక్రింద తేలులా ఉంచాలిరా! ఆడ వాళ్లకు స్వాతంత్ర్యమనీ, వాళ్లకు చదువనీ చెప్పేమాటలలో అర్థం లేదనుకో. ఒకసారి ఆడదాని మాటకు లొంగావో ఇహామరి జన్మకు దాన్ని లొంగ దీయలేవు. అంతే. వాళ్లకు ససేమిరా మనం లొంగ కూడదు.

“నేను ఆలాగే అనుకుంటానురా. మొదట గట్టిగానే మాట్లాడుతాను. వాదనంతా విన్న తరువాత ఆవిడమాటలే న్యాయంగాను, సబబుగాను కనబడతయి. ఆవిడ చెప్పింది గదా అని సబబుగా ఉండీగూడా వినకపోతే మూర్ఖంగా ఉంటుందాయను.

“అదే వచ్చింది. ఆడది చెప్పింది న్యాయంగా ఉందని, ఎప్పుడు తోచిందో అప్పుడే మనకు సర్వ నాశన మయిందనుకో.

“ఆలా తోచకూడ దంటావా? అసలు వాళ్ల మాటే సబబుగా ఉండ దంటావా?

“ఏలా అయినా అనుకో. అరే! వాళ్లమాటలకు సబబేమిటిరా? ఇవ్వాళటి మాటలో సబబేమిటి చెప్పు.

“నెలకు నూరు రూపాయలు సంపాదిస్తూ సంవత్సరానికి ఒక పాతిక రూపాయలు పెట్టి ఒక చీరో ఒక నగో కొని పెట్టడం సబబంటావా? కాదంటావా? అదిగాక మన జీతంలో నుంచి మనస్వంత ఉపయోగం కోసం ఎంత ఖర్చు పెట్టుకుంటున్నామో విచారిస్తే మరీని.

“సబబే ననుకోరా! ఆవిడ అడగడం నీవు ఇవ్వడం ఉండ కూడదురా. నీయిష్టమై నప్పుడు నీవే ఏదో నగో చీరో తెచ్చి పెట్టుతూ ఉండు. మాయింట్లో అది అడగనే కూడదు. అడిగిందో ఆదే నేను తెచ్చిపెట్టను.

“......................”

" ఆమాటకు వస్తే మాయింట్లో నామాటకు వ్యతిరేకించి ఏ విషయంలోనూ మాట్లాడ కూడదు. వెకిలి సమాధానాలు, వాదనలు ఉండనే ఉండవు.

" మా ఆవిడకు వాదన పెంచడమంటే మహాసరదా.

"నీవు నేర్పావు లేరా మొదటినుంచీని. నేనైతేనా...' అని మాశాస్త్రి తల పంకించాడు.

మామూలుగా మా శాస్త్రిని గురించి నేను వింటూండేదానికీ మావాడు చెప్పుతున్న దానికీ సహస్రాంశాలు వార కనుపించింది. లోపలకేం తెలుస్తుంది. తలూకరకంగా చెప్పు కుంటూరు.

ఏతవత మావాడు మాత్రం నన్ను ఆడదానికె లొంగే వాజమ్మ క్రింద జమకట్టాడు. అందుకు నాకు చాలా కష్టమనిపించింది. వాదించి కూడా వాడి మనసులో నుండి ఆ అభిప్రాయాన్ని పారదోలలేక పోయినాను.

## 3

నాలుగు నెలల తరవాత సంగతి. ఆదివారం మధ్యాహ్నం. పదిగంట లయింది. భోంచేశాను. ఏమీ తోచడం లేదు. ఆ పత్రికా ఈ పత్రికా చూస్తూ గంట గంటన్నర గడిపాను. పదకొండు పదకొండున్నరకు మాశాస్త్రి ప్రతి అదివారమూ వచ్చేవాడే మాయింటికి కబుర్లు చెప్పుకోవడానికి. ఎందువల్లనో ఏమో ఆ రోజున అంతవరకూ రాలేదు. వాడి కేదయినా పని తగిలిందేమో నని నేనే వాళ్లయింటికి బయలు దేరాను.

వాళ్లయింటి దగ్గరకు వచ్చేసరికి ఏవేవో పెద్దగా మాటలు వినబడు తున్నవి. ఒకవేళ కోపమొచ్చి మావాడు నోరు చేసుకుంటున్నాడేమో ననుకున్నాను. ఆమాట అనుకోగానే వాడెలా భార్యను అదుపులో ఉంచుతాడో గమనిద్దామనే అభిప్రాయం కలిగింది. గడపలో కాలు పెట్టాను. ఆ కేకలువేసే గొంతు మగవాడి గొంతుగా లేదు. అనుమానం వేసింది. విషయ మేమిటో గ్రహింతామని మెల్లగా బయటిగది తలుపు తీసి ఉంటే అందులోకి వెళ్లి నిద్రనటించడ మారంభించాను.

లోపల శాస్త్రి భార్య, వాడి తల్లీ జగడ మాడుతున్నారల్లే ఉంది. ఆ పెద్ద గొంతుమాత్రం మావాడి భార్యదే.

" మనిషికి ఒకసారి చెప్పితే జ్ఞానముండాలే. ఏళ్లొచ్చినయి ఏంలాభం ? " అని అంటున్నది ఆవిడ.


"నీవు మాటలంటే పడను తెలిసిందా? నీ మోచేతిక్రింది నీళ్లకు ఎవరూ ఆసపడి రాలేదు." అని తల్లి అంటున్నది.

" మోచేతిక్రింది నీళ్లకు ఆశపడ్డావో లేదో అందరికీ తెలుస్తునే ఉంది. నాయింటికి రావద్దు ఛీ అని నోట్లో గడ్డిపెట్టిం తర్వాత నాయింటికి యెందుకు వచ్చావ్? "

" నీయిల్లు ! నీవు సంపాదించావా ? నీతాత సంపాదించాడా ? నా కొడుకు యిల్లు. నేను వచ్చాను.

" కొడుకు ! కొడుకు !! అని సంబరం పడగానే అయిందా ? నీకు ఎవరిమీద ప్రేమ ఉందో అక్కడికే చేరు. నిన్నెవ్వరూ ఉండమని బ్రతిమాలలేదు.

" నీవు బ్రతిమాలితే మటుకు ఉండేదెవరు ? నీ మొహం చూసి రాలేదు.



“ఛీ! బుద్ధి లేనిదానా! మొహంచూడడం అంటావా? నీ కూతురు మొహం చూడుపోయి. నీచెల్లెలి మొహం చూడు. మాటలు మాత్రం సరిగారానీ ఏమనుకున్నావో.

“తీసిన కొద్దీ మాటలు వస్తయి. ఎందుకు నాయనా. చూడు ఎంతెంత లేనిమాటలంటున్నదో, నేను దీన్నె మైనా తప్పుమాట లన్నానా? నావల్ల కాదు నాయనా. ఏదో రమ్మన్నావు గదా అని వచ్చాను. ఇహ వెళ్తాను......” అని కంటతడిపెట్టి డగ్గుత్తిక పడ్డ గొంతుతో “నాకూ నాకొడుక్కూ కాకుండా చేస్తున్నావుగదా నీవు సార్థా పడవు. ఇదుగో వెళ్తున్నాను. నీవే ఉట్టి గట్టుకొని ఊరేగు” అని ఆమెగారు ప్రయాణ సన్నాహం చేయడ మారంభించింది.

మా వాడు “నీ కేమయినా మతిబోయిందా? ఇప్పుడెందుకు లేనిపోని తగాదా పెట్టావు. బుద్ధిఉందా లేదా?

“మీరు మీ అమ్మను వెనక వేసుకుని రానక్కర్లేదు. మీకిష్టమయితే మీరే ఉండండి. నేనే కేగల్లో అని లేచి వెళ్తాను.

“ఆ మాట ఏమొచ్చిందీ ఇప్పుడు?

“ఆమాట రాకపోతే ఏమిటి? మీ ఆమ్మను వెనకేసుకు వచ్చి మీరిద్దరూ ఏకమయి నన్ను నానా మాటలందా మనుకున్నారా?

“పెద్దాపిన్నా లేకుండా మాట్లాడు తుంటే అంటూరా? చావచితక తంతారా?

“ఎందుకు తంతారు? తాటాకు చప్పుళ్లకు జడిసేవా రెవరూ లేరిక్కడ.

“ఇందాకటి నించి చూస్తున్నాను, నేను వచ్చింతర్వాత నైనా తగాదా మాన్తా వేమోనని. అంతకంతకు కళ్లెంలేని గుఱ్ఱం లాగా పెచ్చుమీరి పోతున్నావు.

“మాట లంటూంటే నేను పడను. నేను ఊరుకోను.

“ఎవరన్నారు, ఎందు కన్నారు, ఏమన్నా రంటే చెప్పి ఏడవ్వేం?

“నేనేం ఏడవ వలసిన అవసరం లేదు.

“మాటకు మాట అంటేనే నాకు కోపంవచ్చేది.

“వస్తే రానీయండి. ఏం వస్తే.

మావాడికి కోపం వచ్చినట్లుంది పళ్లుకొరుకుతూ భార్య మీదికి వెళ్లాడు. దెబ్బ ఒంటిమీద పడితే వినపడదూ? ఆవిడ మాటలు మాత్రమే వినపడ్డవి.

“అయ్యో! అయ్యో!! చచ్చాను తల్లీ కొడుకూ కలిసి చంపండి. ఇంతకన్న ప్రయోజ కత్వమేముందీ? మాట మాట్లాడితే ఆడదాని మీదికి రావడం.

మావాడు తరువాత ఏంచేసిందీ తెలియలేదు. కొంచెం సేపు వంటింట్లోకి, నడిమింట్లోకి తిరిగాడట్లే ఉంది గొణుక్కుంటూ, తరువాత తల్లిని పిలిచి

“ఎందుకు వచ్చిందమ్మా ఈ తగాదా అంతానూ?

“నాయనా ఏం చెప్పను? ఎందుకు వచ్చిందని చెప్పను? నేను మీయింటికి రావడం చేత వచ్చింది.

“నీవువస్తే ఏమీ? ఎవరబ్బ సొమ్ము తినడం లేదే.

“మీ ఆవిడకు ఖర్చు బొత్తిగా గిట్టదు. ఆదా చేసుకో వద్దని నేననడం లేదు. నన్ను రమ్మని బలవంతం చేస్తే వచ్చాను. వచ్చాగదా అని మాటలంటే ఎవరు పడతారు? సూటీగానూ పోటీగానూ మాటలంటే ఉప్పుకారం తినే శరీరం గనుక నేనూ పూరుకోలేను. నూరు మాటలంటే ఒకటన్నా తిరిగి అన బుద్ధి పుట్టుతుంది?

“అవును పాపం! నంగనాచివి నేను గడుసుదాన్ని. నేను నూరు అనే దాన్నిని నీవు ఒకటైనా అనలేని దానివి. చెప్పు. అబద్ధాలు చెప్పి నన్నేమీ చెయ్యలేవు.

“నోరు ముయ్యి నీప్రస్తావనే మీరాలేదు.

“నాప్రస్తావన రాబట్టే వచ్చాను.

“తరువాత ఏమయిందమ్మా.

“ఏముందీ? నేనేమో తనకూ తన పిల్లలకూ పెట్టకుండా ఊళ్లో వాళ్లకేమో పెట్టుతున్నానట.

" ఎవరికేం పెట్టావు ?

" నా దగ్గర ఉంది పెట్టడానికి ? మొన్న చిన్నమ్మాయికో పట్టు రెవిక కొనిపెట్టాను.

" నీయిష్టం. నిన్నడగ డానికి మే మెవరం ?

" తోచినప్పుడూ, నాఖర్చులకు పోను మిగిలినప్పుడూ నే నెవరింట్లో ఉంటే వాళ్లకి పెట్టుతూ వుంటాను. అయినా నాకర్మం ఈలా కాలింది. ఎందుకు వచ్చిన బాదర బందీ ? నే నిక్కడ ఉండలేను. వెళ్లుతున్నా.

" నామాట విను. ఉండు. ఎక్కడికి వెళ్లుతావు.

" నీమాట మీదనే ఇన్నాళ్లు ఉన్నాననుకో. నన్ను ఎన్నెన్ని మాట లంటున్నదో దానికి తెలుసు, నాకు తెలుసు. ఇహమాత్రం ఉండలేను.

" పోనీ ఈపూటకు అన్నమయినా తిని వెళ్లు.

" అన్నమా ! నాయనా అన్నం లేకపోతుందీ.


" కాదు నామాట విను. ఒంటిగంట కావస్తున్నా నేను పిండాకూడు తినలేదు. నాకు పెట్టి నీవు తిను. తరవాత నీయిష్టం.

మావాడు కాళ్లు కడుక్కునే ప్రయత్నంలో ఉండడం చూసి వాకిట్లోకి వస్తే నన్ను చూసి ఏం నొచ్చుకుంటాడోనని చడీచప్పుడు లేకుండా ఇంటి దోవపట్టాను. అప్పుడు గాని మరెప్పుడు గాని నే నెప్పుడు గాని దీన్ని గురించి ప్రస్తావన చెయ్యలేదు వాడితో. కాని వెనకటికి ఒకడు పెళ్లాం లోపల కొట్టుతూ వుంటే చావుముండ ! చావు లంజ ! ! అని పదిమందీ వినేట్టు అరిచాడుట విన్నవాళ్లు వాడే కొట్టా డనుకోవడానికి మావాడికి ఆగతి పట్టిందేమో అనుకుంటూ ఉంటాను. ఏగతి పట్టినా మావాడి మాటల ధైర్యానికి నేను చాలా మెచ్చుకుంటూ ఉంటాను. మా ఆవిడతో నేను ఏవిషయం ప్రస్తావిస్తున్నా మాశాస్త్రి మాటలు మాత్రం తప్పక జ్ఞాపకం వస్తూ ఉంటయి.



నమోనా ఉచితము

# ఇండోబామ్




ఇతర అంజనములు, బాములవలె మండదు. ఒకతూరి వాడినవారు మరల మరల వాడుచు స్నేహితులకు సిఫారసు జేయుచున్నారు. తలనొప్పులు, పారశ్వపు నొప్పులు, వాయువుపోట్లు, వెన్నుపోటు, బెణుకులు, పంటినొప్పి, జలుబు, దగ్గు మొదలుగు బాధలను పోగొట్టును. అమూల్యముగు ఓషధులచేతయారుకాబడినది. బాధగల స్థలమున మందుతో తోమిన చర్మమునందు ప్రవేశించి బాధను పోగొట్టును. అన్నివిధములగు నొప్పులకు బాధలకు సిద్ధౌషధము. ప్రతిచోటను ఏజెంట్లు కావలయును.

చక్కని డబ్బి సహా బుడ్డి 1-కి రు. 0-8-0 బుడ్లు 3-కి రు. 1-4-0

పోస్టు ఖర్చులు వేరు.

కార్నిక్ బ్రదర్స్, గిర్గాం, బొంబాయి. 4